క్లుప్తంగా

జగన్‌ను కలిసిన అనిల్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ కలిసి పలు అంశాలపై చర్చించారు.

మెరుగైన సేవలందించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పని చేసే అధికారులు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపర్చుకొని, వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ సూచించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో జిల్లా విద్యుత్ అధికారులు, అకౌంట్స్ ఆఫీసర్లతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్తంభాలకు అడ్డుగా ఉన్న కొమ్మలు, తీగలను తొలగించాలని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలపై సంబంధిత సిబ్బంది ఫోన్ నంబర్లను పొందుపర్చాలని కోరారు. సూర్యఘర్, అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణపై 50 శాతం సబ్సిడీ అందించే పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, డీఈఈ మునీంద్ర, ఏఈ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి



ప్లకార్డులతో రైల్వే సీఐ, ఎస్సైలు

నెల్లూరు(క్రైమ్): వేసవిలో రైళ్లలో నేరాలు జరిగే అవకాశం ఉందని, ఈ క్రమంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ సూచించారు. నేర నియంత్రణ చర్యలను వివరిస్తూ రూపొందించిన ప్లకార్డులతో ర్యాలీని నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లో సిబ్బందితో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రైళ్లలో నేరాలు జరగకుండా బీట్లను పటిష్టం చేశామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే డయల్ 112, 139, బీట్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. నెల్లూరు, గూడూరు, కావలి రైల్వే ఎస్సైలు హరిచందన, మాలకొండయ్య, చెన్నకేశవ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

25న బహిరంగ వేలం

నెల్లూరు(క్రైమ్): చెముడుగుంటలోని ఓపెన్ ఎయిర్ జైల్లో 104 మామిడి చెట్లకు సంబంధించిన కాయలు, పండ్ల బహిరంగ వేలాన్ని ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని జిల్లా కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు అదే రోజున దరావతును చెల్లించి టోకెన్ పొందాలన్నారు. వేలంలో దక్కించుకున్న వారు వెంటనే మొత్తం సొమ్మును చెల్లించి తోటను స్వాధీనం చేసుకోవాలని కోరారు. పంటకాలం ముగిసేంత వరకు తోట కాపలా, రక్షణ బాధ్యతలను వారు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే జైళ్ల శాఖకు ఎలాంటి సంబంధం లేదని, వివరాలకు 98852 34850 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. వర్సిటీ అభివృద్ధిపై చర్చించారు. 2025 – 26 సంవత్సరం నుంచి ఆత్మకూరులో విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించేందుకు అవసరమైన అంశాలు, నిధులను కేటాయించాలని కోరారు. సాయిప్రసాద్‌రెడ్డి, సుజయ్‌కుమార్, హనుమారెడ్డి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లీపురంలో కార్డన్ అండ్ సెర్చ్



నెల్లూరు సిటీ: ప్రజలకు ధైర్యాన్ని నింపుతూ, నేర నియంత్రణే లక్ష్యంగా కార్డన్ అండ్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నామని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. అల్లీపురం టిడ్కో గృహాల్లో కార్డన్ అండ్ సెర్చ్‌ను మంగళవారం నిర్వహించారు. 700 గృహాల్లో నలుగురు సీఐలు, 12 మంది డీఎస్పీలు, 70 మంది కానిస్టేబుళ్లు తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని మూడు బైక్‌లు, ఆటో, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. వేలిముద్రల సేకరణ ద్వారా ఎనిమిది మంది పాత నేరస్తులను గుర్తించామని పేర్కొన్నారు.

తవ్వుకున్నోడికి.. తవ్వుకున్నంత

- మట్టిని కొల్లగొడుతున్న తమ్ముళ్లు
- కల్లూరుపల్లి చెరువులో ఇదీ తంతు



మట్టిని తరలించేందుకు సిద్ధంగా ట్రాక్టర్లు

నెల్లూరు సిటీ: ఇసుక, మట్టి ఎక్కడ కనిపించినా తెలుగు తమ్ముళ్లు వదలడంలేదు. నిబంధనలకు పాతరేసి ఇష్టారాజ్యంగా తవ్వకాలకు పాల్పడుతున్నారు. తవ్వుకున్నోడికి.. తవ్వుకున్నంత అనే రీతిలో చెలరేగిపోతున్నారు. స్థానిక కార్పొరేటర్ భర్త తన అనుచరులతో కలిసి కల్లూరుపల్లి చెరువులో మట్టిని లేఅవుట్లకు ట్రాక్టర్లలో నాలుగు రోజులుగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో 'సాక్షి' మంగళవారం పరిశీలించగా, ఈ అంశాలు బయటపడ్డాయి. 'తవ్వేస్తాం .. అమ్మేస్తాం' అనే శీర్షికన సాక్షిలో కథనం ఈ నెల తొమ్మిదిన ప్రచురితమైంది. దీంతో అధికారుల సూచనల మేరకు కొంత కాలంగా మట్టి తవ్వకాలకు బ్రేక్ వేశారు. అయితే తాజాగా మరోసారి ప్రారంభమైంది.

నిత్యం 20 ట్రిప్పులు

టీడీపీ నేతలు దగ్గరుండి మరీ మట్టిని ట్రాక్టర్లలో సమీపంలోని ఓ లేఅవుట్‌కు తరలిస్తున్నారు. ఇలా నిత్యం దాదాపు 20 ట్రిప్పుల మేర తరలిస్తున్నారని సమాచారం. గతంలో జేసీబీతో తవ్వకాలు జరపగా, ప్రస్తుతం గుట్టుచప్పుడు కాకుండా కూలీలను ఏర్పాటు చేసుకొని తమ పనిని కానిచ్చేస్తున్నారు.

శ్మశానవాటిక రోడ్డునూ వదలడంలేదు

కల్లూరుపల్లిలోని చెరువులో పదడుగుల మేర తవ్వకాలు జరిపారు. చెరువు సమీపంలోని శ్మశాన వాటికకు వెళ్లే దారినీ వదలడం లేదు. ఇరువైపులా తవ్వకాలు జరపడంతో రానున్న రోజుల్లో దారి లేకుండా పోయే ప్రమాదం పొంచి ఉంది. ఇరిగేషన్, పోలీస్ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(అర్బన్): రోగులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. నగరంలోని పెద్దాస్పత్రిలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. గతంలో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు.. వాటి అమలు తీరును డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. హెచ్‌డీఎస్‌కు ఆదాయం చేకూరేందుకు గానూ ఆస్పత్రి ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికల తయారీకి అవసరమైన నిధుల మంజూరుకు అనుమతులిచ్చారు. హెచ్ఐవీ విభాగంలో నీటి పైప్‌లైన్ నిర్మాణానికి రూ.ఎనిమిది లక్షలు, డాక్టర్లు, పీజీ విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్, ఏసీల ఏర్పాటుకు అంగీకరించారు. ఎమ్సీహెచ్ బ్లాక్‌లో మరమ్మతులు చేపట్టేందుకు, వివిధ డిపార్ట్‌మెంట్లకు అవసరమైన కూలర్, ఇతర నిధుల మంజూరుకు అంగీకారం తెలిపారు.

అభివృద్ధి కమిటీకి సమాచారమివ్వరా..?

హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీకి పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ ఏమీ చెప్పడంలేదని, సమావేశానికి సంబంధించిన అజెండాను అడిగినా ఇవ్వలేదని, అంతా కలెక్టర్‌పై చెప్తున్నారని, ఇదెంత వరకు సమంజసమని కమిటీ కో ఆర్డినేటర్ మదపర్తి శ్రీనివాసులు, సభ్యుడు మొగరాల సురేష్ ప్రశ్నించారు. తమను లెక్కలోకి తీసుకోకపోతే ఇక కమిటీలో స్థానమెందుకని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుల అభిప్రాయాలను ఎందుకు తీసుకోలేదని సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. ఇక అలా జరిగేందుకు వీల్లేదని, అజెండా కాపీని రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపడంతో పాటు ఈ – మెయిల్ చేయాలని ఆదేశించారు.

సమస్యలను ఎందుకు చేర్చలేదు

ఐసీయూల్లో రోగులకు ఏసీ లేదని, ఇలాంటి వాటిని అజెండాలో ఎందుకు చేర్చలేదని మొగరాల సురేష్ ప్రశ్నించారు. వివిధ సమస్యలను తెలియజేయగా, సాధ్యమైనంత త్వరలో న్యాయం చేసేందుకు యత్నిస్తానని కలెక్టర్ తెలిపారు. అజెండాలోని అంశాల మేరకు నాలుగు చోట్ల ఆర్వో ప్లాంట్లు, రెఫ్రిజిరేటర్లు, ఏసీలను ఏర్పాటు చేస్తామన్నారు. పేయింగ్ రూమ్‌లకు రూ.500 చొప్పున అద్దె వసూలు, పార్కింగ్‌కు ఫీజును ఏర్పాటు చేసి ఆస్పత్రికి ఆదాయాన్ని చేకూర్చేందుకు సహకరిస్తామని ప్రకటించారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, అబీదాబేగం, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజమన్నార్, నరేంద్ర, డీఎంహెచ్ఓ సుజాత, డీసీహెచ్ఎస్ పరిమళ, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ సుధీర్‌కుమార్, డాక్టర్లు మస్తాన్‌బాషా, గోవింద్, సుశీల్ పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

నెల్లూరు(అర్బన్): దోమలను నివారించడం ద్వారా చికున్ గున్యా, డెంగీ, మలేరియా, ఫైలేరియా లాంటి వ్యాధులను దూరం చేయొచ్చని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు గానూ నీటి నిల్వల్లేకుండా చూడాలని సూచించారు. పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు



పేరుకుపోయిన మురుగును పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో కాలువల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇన్‌చార్జి కమిషనర్ నందన్ ఆదేశించారు. ఒకటో డివిజన్లోని కల్లీ కాలనీ, నవలాకులతోట, నారాయణరెడ్డిపేట, కొత్తకాలువ సెంటర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన సమస్యను పరిష్కరించే విషయమై అర్జీదారుడ్ని కలుసుకున్నారు. సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించాలని సూచించారు. డివిజన్లోని కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా జరపాలని ఆదేశించారు.

నియామక ఉత్తర్వుల అందజేత

కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందుతున్న వారు విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని బదిలీపై వెళ్తున్న కమిషనర్ సూర్యతేజ, ప్రస్తుత ఇన్‌చార్జి కమిషనర్ నందన్ సూచించారు. ఈ మేరకు నలుగురికి నియామక ఉత్తర్వులను అందజేశారు.

ఈఎస్ఐ సేవలపై సమావేశం

ఈఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ నందన్ కోరారు. ఈఎస్ఐ సేవలను పొందేందుకు అవసరమైన విధానాలపై కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలో పనిచేస్తున్న రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు అత్యవసర వైద్య సదుపాయాల కోసం మెడికవర్ లేదా పొగతోటలోని అనసూయ ఆస్పత్రుల్లో సేవలు పొంది, బిల్లులను ఈఎస్ఐ ఆస్పత్రికి అందజేసి రీయింబర్స్‌మెంట్ పొందొచ్చని తెలిపారు. సాధారణ అనారోగ్యాలకు ఈఎస్ఐ ఆస్పత్రిని సందర్శించాలని, వైద్యుల సిఫార్సు మేరకు తిరుపతిలో వైద్యసేవలను అందిస్తారని తెలిపారు. ఎంహెచ్ఓ చైతన్య, ఈఎస్ఐ ఆఫీస్ మేనేజర్ శివాజీ, వైద్యులు వెంకటేశ్వర్లు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(లీగల్): జిల్లా జడ్జి శ్రీనివాస్‌ను నగరంలోని ఆయన కార్యాలయంలో కమిషనర్ నందన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై అవగాహన కల్పించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

నెల్లూరు రూరల్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై అవగాహన కల్పించే కరపత్రాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లుపై అవగాహన కల్పించేలా ముస్లిం మైనార్టీ మోర్చా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీ నేతలు యరబోలు రాజేష్, మొగరాల సురేష్, లాల్ ఖాజామస్తాన్, హిదాయతుల్లా, ముక్కు రాధాకృష్ణ, హర్షవర్ధన్, కరణం సుభాషిణి, పరశురామ్, మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న సురేంద్ర తదితరులు

నెల్లూరు(అర్బన్): పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డాక్టర్ బద్దెపూడి సురేంద్ర పేర్కొన్నారు. ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుజబుజ నెల్లూరులోని సింహపురి చిల్డ్రన్స్ హోమ్‌లో అవగాహన కార్యక్రమాన్ని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు(బృందావనం): గణేశ్ ఘాట్ సమీపంలోని స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయం వద్ద చలివేంద్రాన్ని చేయూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. తొలి రోజు తాగునీరు, మజ్జిగను పంపిణీ చేశారు. బీజేపీ, బీజేవైఎం నేతలు హర్షవర్ధన్, సురేష్, ట్రస్ట్ నిర్వాహకులు యశ్వంత్‌కుమార్, నందకిశోర్, కామేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవాబుపేట సబ్‌స్టేషన్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులను చేపట్టనున్న క్రమంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవాబుపేట, ఎఫ్సీఐ కాలనీ, నజీర్‌తోట, యనమలపాళెం, బంగ్లాతోట, కుసుమ దళితవాడ, సౌత్‌రాజుపాళెం, అల్లీపురం ఇండస్ట్రియల్ ప్రాంతాలు తదితర చోట్ల ఉదయం 8.30 నుంచి రాత్రి ఏడు వరకు సరఫరా ఉండదని చెప్పారు.

కత్తితో బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): స్కూటీపై వెళ్తున్న స్నేహితులను కత్తులతో ఇద్దరు వ్యక్తులు బెదిరించి నగదును దోచుకెళ్లిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. వాకర్స్‌రోడ్డులోని పొర్లుకట్టలో నివాసం ఉంటున్న షాకీర్ తన స్నేహితుడు ఖాదర్‌తో కలిసి స్కూటీపై పొర్లుకట్ట నుంచి పొట్టేపాళేనికి ఆదివారం బయల్దేరారు. ఈ క్రమంలో పుత్తా ఎస్టేట్స్ ఆర్ ఓ క్రాస్‌రోడ్డు వద్దకొచ్చేసరికి విరాట్‌నగర్‌కు చెందిన సుల్తాన్, కసాయివీధికి చెందిన సొహైల్ వీరిని అడ్డుకున్నారు. కత్తులతో చంపుతామని బెదిరించి షాకీర్ జేబులోని రూ.500ను దోచుకున్నారు. స్థానికులు రావడాన్ని గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రదానం



గోపాల్‌రెడ్డి (ఫైల్)

నెల్లూరు(అర్బన్): కసుమర్తిపాడులోని రామాలయ వీధికి చెందిన గోపాల్‌రెడ్డి (80) మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను చిరంజీవి ఐ బ్యాంక్ ఇన్‌చార్జి సుధీర్ సహకారంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబసభ్యులు దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు (టౌన్): అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను మంగళవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, హెచ్ఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించాలనే అంశంపై నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సదస్సును లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ ఇలియాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, సీపీఐ నేత సిరాజ్, సాగర్, రషీద్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. విశేష పూజలను మందిర ప్రధానార్చకుడు బృందావనం శ్రీనివాసదీక్షితులు ఆధ్వర్యంలో జరిపారు. స్వామివారు సర్వాలంకార శోభితంగా కొలువై బాలాజీనగర్, ఏసీనగర్ తదితర వీధుల్లో సాయంత్రం విహరించారు. ఉభయకర్తలుగా కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ నిర్వాహకులు అమరా మోహన్‌రావు, తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కౌన్సెలింగ్ చేస్తున్న సుబ్బారావు

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వేదాయపాళెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు హెచ్చరించారు. నేర నియంత్రణ చర్యల్లో భాగంగా స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలను మంగళవారం రాత్రి ఆయన చేపట్టారు. పదుల సంఖ్యలో ఆకతాయిలు, అల్లరిమూకలను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారి సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేశారు. ఈవ్‌టీజింగ్, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అత్యవసరమైతే తప్ప రాత్రి వేళ రోడ్లపైకి రాకూడదని, నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు చేపడతామన్నారు.

జిల్లాలో క్యూఆర్ కోడ్ విధానం అమలు



సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న మురళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ చెల్లింపుల్లో క్యూఆర్ కోడ్ విధానం జిల్లాలో మే నుంచి అమల్లోకి రానుందని విద్యుత్ శాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పేర్కొన్నారు. 2024 – 25 ఆర్థిక సంవత్సర లావాదేవీల ముగింపు అకౌంటింగ్‌పై జిల్లాలోని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశాన్ని విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిల్లులపై క్యూర్ కోడ్ వచ్చిందా లేదానని పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే సంబంధిత విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, ఉప రెవెన్యూ కార్యాలయాలను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. అకౌంట్స్ ఆఫీసర్ విజిత తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటించకపోతే చర్యలు



సూచనలు చేస్తున్న చైతన్య

నెల్లూరు(బారకాసు): నిర్దేశించిన ప్రమాణాలు, సూచనలను పాటించకుండా ప్రజారోగ్యానికి విఘాతం కలిగిస్తే సంబంధిత సిబ్బంది, కార్యదర్శులపై చర్యలు తప్పవని ఎంహెచ్ఓ చైతన్య స్పష్టం చేశారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో నైట్ శానిటేషన్ మస్టర్‌కు ఆయన హాజరయ్యారు. 16వ డివిజన్లోని గుర్రాలమడుగు సంఘం, ఆదిత్యనగర్‌లో పర్యటించి ఖాళీ స్థలాల్లో వేసిన చెట్ల కొమ్మలు, ఇతర వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. కాలువల్లో ఎండిపోయిన ఆకులు చేరడంతో దోమల లార్వా ఉత్పత్తిని గమనించి వెంటనే డీసిల్టేషన్ చేయించి స్ప్రేయింగ్ నిర్వహించారు.

రైతులకు అవగాహన



నెల్లూరు సిటీ: పొలంలో పోషక లోపాలకు అనువుగా ఎరువులను వినియోగించాలని రూరల్ వ్యవసాయాధికారులు శ్రీనివాసులు, నాగమోహన్ పేర్కొన్నారు. కాకుపల్లిలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మట్టి నమూనాలను సేకరించి.. భూసార పరీక్షలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

బారాషహీద్ దర్గా ముఖద్వార పనుల పరిశీలన



నెల్లూరు సిటీ: బారాషహీద్ దర్గా ముఖద్వార పనులను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.85 లక్షలతో వీటిని నిర్మిస్తున్నామని, రొట్టెల పండగ నాటికి ఒక ముఖద్వారాన్ని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నెల్లూరు సిటీ: మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్ అని, దీన్ని ఫోన్లలో ఇన్‌స్టల్ చేసుకోవాలని రూరల్ శక్తి టీమ్ ఏఎస్సై సుబ్బరాజు పేర్కొన్నారు. గుడ్, బ్యాడ్ టచ్ తదితరాలపై కనుపర్తిపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఇథాకా ఇంటర్నేషనల్ స్కూల్లో అవగాహన కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఇథాకా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ శోభన, జీఎం జీవన్, రూరల్ సబ్ డివిజన్ శక్తి టీమ్ హెచ్‌సీ శామ్యూల్, పీసీలు శ్రీనివాసులు, రంగయ్య, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ప్రసాద్‌రెడ్డి తండ్రి కరాది వెంకటశేషారెడ్డి మంగళవారం మరణించారు. ఈ క్రమంలో ఏసీనగర్‌లోని నివాసంలో ఆయన భౌతికకాయానికి పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మెట్టు రామచంద్రప్రసాద్ కన్నుమూత



నెల్లూరు(బృందావనం): పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ (84) చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. ఆయన మృతికి జయప్రకాష్, గోవిందరాజు సుభద్రాదేవి, నలుబోలు బలరామయ్యానాయుడు తదితరులు సంతాపం తెలియజేశారు.

బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్‌గా అచ్యుత్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నరసింహకొండపై మే ఆరు నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కమిటీ చైర్మన్‌గా అచ్యుత్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులను దేవదాయ శాఖ మంగళవారం జారీ చేసింది. కమిటీలో 11 మంది సభ్యులున్నారు.